క్లుప్తంగా

ఒలింపిక్ సంఘ సమావేశం రేపు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా ఒలింపిక్ సంఘ సర్వసభ్య సమావేశం ఈ నెల 10న కాకినాడలోని రాయల్ పార్కు హోటల్‌లో సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అధ్యక్షతన జరుగుతుందని సంఘ కార్యదర్శి జి.ఎలీషాబాబు ఆదివారం తెలిపారు. ఈ సమావేశంలో ఒలింపిక్ సంఘ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ అయిన డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మృతికి నివాళులు అర్పించడం, ఈ నెల 23న అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవ ఒలింపిక్ రన్ నిర్వహణ, మినీ ఒలింపియాడ్ నిర్వహణ తేదీలు, వేదికలు, సెప్టెంబరు 28 జరిగిన ఎగ్జిక్యూటివ్ సమావేశం మినిట్స్ ఆమోదం తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. ఒలింపిక్ సంఘ సభ్యులంతా హాజరు కావాలని ఎలీషాబాబు కోరారు.

11న అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. సీనియర్స్ విభాగంలో ఈ ఎంపికలు ఉంటాయన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే అంతర్ జిల్లాల అథ్లెటిక్స్‌లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. ఈ ఎంపికలకు 2007 ఆగస్టు 20 తేదీ ముందు జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 8 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

అరట్లకట్ట విద్యార్థికి షైనింగ్ స్టార్ పురస్కారం


తోట లోకేష్

కరప: అరట్లకట్టలోని ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి తోట లోకేష్ షైనింగ్ స్టార్ పురస్కారానికి ఎంపికై నట్టు హెచ్‌ఎం పి.శ్రీనివాసకుమార్ ఆదివారం తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు షైనింగ్ స్టార్ పేరిట ప్రతిభా పురస్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. దీనికిగాను రూ.20 వేలు ప్రోత్సాహకాన్ని అందజేస్తుందని తెలిపారు. అరట్లకట్ట హైస్కూల్‌లో చదివిన తోట లోకేష్ పదో తరగతి ఫలితాల్లో ప్రతిభచూపి 585 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్‌తో పాటు మండలంలో ప్రథమ స్థానంలో నిలిచి, షైనింగ్ స్టార్ పురస్కారానికి ఎంపికైనట్టు హెచ్‌ఎం వివరించారు. కాకినాడ టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని కలెక్టర్ షణ్మోహన్, డీఈఓ రమేష్ చేతులమీదుగా అందుకుంటాడన్నారు. లోకేష్‌ను సర్పంచ్ గోపి సత్యవేణి, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, హెచ్‌ఎం శ్రీనివాసకుమార్ అభినందించారు.

గ్రంధి బాబ్జీకి సత్కారం


గ్రంధి బాబ్జీని సత్కరిస్తున్న యంగ్‌మైండ్స్ టీమ్ సభ్యులు

బాలాజీచెరువు: ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ కాకినాడ అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రముఖ వ్యాపారవేత్త గ్రంధి నారాయణరావు (బాబ్జీ)ని యంగ్ మైండ్స్ టీమ్ ఆదివారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా యంగ్ మైండ్ ఫౌండర్ వాకాడ చిన్న మాట్లాడుతూ గ్రంధి బాబ్జీ వ్యాపారవేత్తే కాకుండా మంచి సంఘ సేవకులన్నారు. అనేక మందికి జీవనోపాధి చూపుతున్నారని కొనియాడారు. అనంతరం బాబ్జీని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా కన్వీనర్ వాకాడ చిన్న, కార్యదర్శి డీవీవీ బాపిరాజు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పి.రాజారావు, యంగ్‌మైండ్స్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో పూజలు


సామర్లకోట మద్రాసు హైకోర్ట్ జడ్జి దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న ఆలయ పండితులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయాన్ని మద్రాసు హైకోర్ట్ జడ్జి ఎన్.మాల దంపతులు, కమిషనర్ ఆఫ్ యూత్ సర్వీసెస్ (విజయవాడ) కె.శారద దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో కాలభైరవ స్వామి, ధ్వజస్తంభం, పెద్ద నంది, ఉప ఆలయాలు, మూల విరాట్‌లతో పాటు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. పూజల అనంతరం వారికి ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. వారికి స్వామివారి ప్రసాదం, ఫొటోలను ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు అందజేశారు.

చెత్తాచెదురుగా..


నాన్సీ స్ట్రీట్‌లో డంపర్‌బిన్ నిండిపోయి రోడ్డు పైకి వచ్చిన చెత్త


కొండయ్యపాలెంలో డంపర్ బిన్ల వద్ద నిండిన చెత్త

- నగరంలో ఎక్కడ చూసినా ఇంతే
- డంపర్ బిన్ల వద్ద తొలగించని వ్యర్థాలు
- అటుగా వెళ్తే ముక్కు మూసుకోవాల్సిందే

బోట్‌క్లబ్: అంతన్నారు... ఇంతన్నారు... చెత్త కనిపించదన్నారు... తీరా చూస్తే ఎటు వెళ్లినా ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి తెచ్చారు.. కాకినాడ నగరం స్మార్ట్ సిటీ స్థాయికి ఎదిగినా చెత్త సమస్య తీరడం లేదు. రోజూ టన్నుల కొద్దీ వస్తున్న వ్యర్థాల తరలింపులో నిర్లక్ష్యం వెంటాడుతోంది. ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. అక్కడ పశువులు, కుక్కలు చేరి చెల్లాచెదురు చేస్తున్నారు. దీనివల్ల రోడ్డంతా చెత్త పోసినట్లు అవుతోంది. నగరంలో సుమారు ఐదు లక్షల జనాభా నివసిస్తున్నారు. రోజూ సుమారు 90 టన్నులకు పైగా చెత్త వస్తుందని కార్పొరేషన్ అధికారుల అంచనా. నగరంలో సుమారు వెయ్యి మందికి పైగా పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. వీరు రోజూ వారికి కేటాయించిన ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల్లో చెత్త, పూడికలు తొలగించాల్సి ఉంది. వారు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో రోడ్లపై చెత్త పేరుకుపోవడం, డ్రైనేజీలు కొంపు కొట్టడం జరుగుతోంది. దోమల ఉధృతి నానాటికీ పెరిగి, రాత్రిళ్లు కంటి మీద కునుకు దూరమవుతుందని ప్రజలు అంటున్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో చెత్తను తరలిస్తున్నా, శివారు ప్రాంతాల వైపు రోజుల వెళ్లడం లేదు. విద్యుత్‌నగర్, అశోక్‌నగర్, ఎల్‌బీ నగర్, నాన్సీస్ట్రీట్, జగన్నాథపురం, పెదమార్కెట్, కచేరిపేట వంటి ప్రాంతాల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి చెత్త తరలిస్తున్నారు.

గతమెంతో ఘనం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేసేవారు. దీంతో ఏ వీధిలో చెత్త కనిపించేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికీ చెత్త సేకరణ నిలిపివేయడంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. పారిశుధ్య సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న తడి, పొడి చెత్తను విడివిడిగా తీసుకునేవారు. ప్రస్తుతం ఇంటింటికీ చెత్త సేకరణ నిలిపివేయడంతో ప్రజలు పలు వీధుల్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్ల వద్ద చెత్త వేస్తున్నారు. రోజుల తరబడి ఈ చెత్త తొలగించకపోవడంతో డంపర్ బిన్లు నిండిపోయి రోడ్డుపైకి చెత్త చేరుతుంది. ఈ బిన్లలో చెత్త కారణంగా దుర్వాసన వస్తుందని ప్రజలు అంటున్నారు. నగరంలో వెయ్యి మందికి పైగా పారిశుధ్య సిబ్బంది ఉన్నా అధికారుల పర్యవేక్షణ లేక ఇబ్బంది ఎదురవుతోంది. కొందరు పారిశుధ్య సిబ్బంది విధులు వచ్చినట్లు వచ్చి మస్తర్లు వేయించుకుని, పని చేస్తున్నట్లు ఫొటోలు తీయించుకొని వెళ్లిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

దోమలకు పొగ ఎక్కడా!

గత ప్రభుత్వంలో దోమల నియంత్రణకు ప్రతి వీధిలో పొగ మందును స్ప్రే చేసేవారు. దీంతో ప్రజలు రాత్రి సమయాల్లో హాయిగా నిద్రపోయేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి అసలు ఒక్కసారి కూడా ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. ఇలా దోమలు ఉధృతి పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో ఉక్కబోతను అధిగమించేందుకు రాత్రి సమయాల్లో కిటికీలు తీస్తే చాలు గుంపులు గుంపులుగా దోమలు వస్తున్నాయి. దీంతో ప్రజలు భయపడి ఉక్కపోతనైనా భరిస్తున్నారే తప్ప కిటికీలు తెరవడం లేదు.

రోజూ చెత్త తరలించాలి



ద్విచక్ర వాహనంపై వెళ్తున్నప్పుడు చెత్తకుప్పల వద్ద దుర్వాసనకు ముక్కు మూసుకోవాల్సి వస్తుంది. డంపర్ బిన్లలో చెత్తను రోజూ తరలించకపోవడంతో అక్కడ దుర్వాసన భరించలేకపోతున్నాం. కార్పొరేషన్ అధికారులు స్పందించి తగిన ఏర్పాటు చేయాలి.

–మలకల వెంకటరమణ, కచేరిపేట

దోమలతోనే ఇబ్బంది



రోడ్లపై చెత్త కుప్పలు, డ్రైనేజీల్లో పూడికలు తీయకపోవడంతో రోజురోజుకూ దోమలు పెరిగిపోతున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో దోమల కారణంగా నిద్రపోవడం చాలా కష్టంగా ఉంది. ఒకపక్క ఉక్కబోత, మరోపక్క దోమలతో ఇబ్బంది పడుతున్నాం.

–ఏలూరి రాణి, పెద్ద మార్కెట్

ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ ఐలాండ్


ట్రాఫిక్ ఐలాండ్‌కు శంకుస్థాపన చేస్తున్న రోటరీ సెంట్రల్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ ఐలాండ్ నిర్మిస్తున్నట్లు రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ వీరభద్రారెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ ఆధ్వర్యంలో ఆదివారం ముత్తా వారధి కింద మిలటరీ రోడ్డులో రూ.20 లక్షలతో ట్రాఫిక్ ఐలాండ్‌కు శంకుస్థాపన చేశారు. ట్రాఫిక్ ఐలాండ్ ప్రాజెక్టు చైర్మన్ మైలపల్లి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రారెడ్డి మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఐలాండ్ లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణతోపాటు ఈ ప్రాంతాన్ని ఒక ల్యాండ్ మార్క్‌గా తీర్చిదిద్దేందుకు రోటరీ సెంట్రల్ క్లబ్ ఈ ఐలాండ్ నిర్మాణానికి ముందుకు వచ్చిందన్నారు. మైలపల్లి విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ పైలాన్‌ను అందరిలో సేవా భావం వెల్లివిరిసే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి ఆకర్షణీయమైన డిజైన్ ఏర్పాటు చేసిన ఇంజినీర్ కృష్ణప్రసాద్‌ను అభినందించారు. పైలాన్ నిర్మాణానికి సహకారం అందించిన కలెక్టర్ షణ్మోహన్ సగిలికి, నగరపాలక సంస్థ కమిషనర్ భావనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఐలాండ్‌ను రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్‌లు ఎల్.సత్యనారాయణన్, ఎస్‌వీఎస్ రావు, కల్యాణ్‌చక్రవర్తి, పోలిశెట్టి ఈశ్వరరావు, శిష్టల శ్రీకాంత్, కోరుమిల్లి ప్రసాద్, బంగారు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి వారాహి గుప్త నవరాత్రులు


గంగనాపల్లి వారాహి నగర్‌లో అమ్మవారు


వారాహి గుప్త నవరాత్ర ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న భక్తులు

కాకినాడ రూరల్: గంగనాపల్లి వారాహి నగర్‌లోని శ్రీవారాహి అమ్మవారి ఆలయంలో ఈ నెల 26 నుంచి వారాహి గుప్త నవరాత్రులు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఉత్సవాల కోసం పందిరి రాట వేసి, ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. రోజూ తెల్లవారు జామున 3.30 గంటలకు అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ, రాత్రి 7 గంటలకు అమ్మవారికి మూల నక్షత్ర, చండీ హోమాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. భక్తుల 27 జన్మ నక్షత్రాలతో 9 రోజుల పాటు హోమాలు జరుగుతాయని అర్చకులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఇంటర్ మెరిట్ విద్యార్థులకు సత్కారం


రమణయ్యపేటలో సత్కారం పొందిన ఇంటర్ మెరిట్ విద్యార్థులతో నిర్వాహకులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆదివారం ఘనంగా సత్కరించి, నగదు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ విద్యతో పాటు నైతిక విలువలు బోధించడం ద్వారా పిల్లలు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. నేడు విద్యార్థులు అన్ని రంగాల్లో ఉత్తమ ఫలితాలతో ముందుకు వెళుతున్నారన్నారు. ఇంటర్‌లో ఫలితాలను పునాదిగా మార్చుకుని ఉన్నత చదువులు కొనసాగించి, మంచి ఉద్యోగం పొందాలని ఆయన ఆకాంక్షించారు. అడబాల రత్నప్రసాద్, డాక్టర్ అద్దాల సత్యనారాయణ, ప్రసాద్ నాయుడు, సూర్యదేవర రామారావు, కాలా శ్రీను, బుద్ధరాజు సత్యనారాయణరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ఓం నమఃశ్శివాయ, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

సేవలు ఆదర్శనీయం


శివారెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా నాయకులు


కాకినాడ క్రైం: ఏపీఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆదివారం విజయవాడ సీఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్జీఓ నేతలు పాల్గొన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నాయకుల బృందం మాజీ సారథి దంపతులను ఘనంగా సత్కరించింది. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ కేవీ శివారెడ్డి వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగిగా ఎనలేని సేవలందించారన్నారు. ఓ వైపు ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ.. మరోవైపు ప్రతిష్టాత్మకంగా సంఘ బాధ్యతలు చేపట్టారన్నారు. భవితరాలకు ఆయన నాయకత్వ లక్షణాలు, వృత్తి పట్ల నిబద్ధత, కీలక వేళల్లో ఆదర్శవంతమైన నాయకుడిగా ఆయన చూపిన పటిమ ఆదర్శనీయమని కొనియాడారు. శివారెడ్డి దంపతులను సత్కరించిన వారిలో సంఘ మాజీ జిల్లా అధ్యక్షుడు బూరిగ ఆశీర్వాదం, కాకినాడ నగర ఉపాధ్యక్షుడు రమేష్, రాజమహేంద్రవరం యూనిట్ కార్యదర్శి ఎస్.ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రాఘవ, మండపేట యూనిట్ అధ్యక్షుడు మల్లిఖార్జునతో పాటు వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నారు.

అలరించిన సంగీత విభావరి


శిల్పారామంలో సత్కళావాహిని కృష్ణమాచార్యుల బృందం సంగీత విభావరి

కాకినాడ రూరల్: స్థానిక సూర్యారావుపేట బీచ్ రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం వినోద కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి అలరించింది. కాకినాడ సత్కళావాహిని (భక్తిరస సంగీత సంస్థ) ఆధ్వర్యంలో సాయంత్రం కాలక్షేపంగా సందర్శకులను భక్తి పాటలతో మంత్ర ముగ్ధులను చేశారు. సత్కాళావాహినికి చెందిన డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు, 50 మంది శిష్య బృందం పాల్గొని త్యాగరాజు, అన్నమయ్య, రామదాసు కీర్తనలతో పాటు భక్తి, దేశభక్తి గీతాలు ఆలపించారు. సంగీత విభావరికి కీబోర్డు ద్వారా ఈవీ జితేంద్ర, ఇ.లక్ష్మీకృష్ణ సహకరించారు. కార్యక్రమంలో తురగా సూర్యారావు, భాస్కర రామం, గరికిపర్తి నమశ్శివాయ, లక్ష్మి, నాగమణి, లావణ్య, ధనుంజయ, హర్షిణి, గాయత్రీ దేవి, రన్విత, కావ్య, ఆశ్రిత, సమన్విత, నవినా, తన్విక, రహినా తదితరులు పాల్గొన్నారు. సంగీత విభావరితో అలరించిన కృష్ణమాచార్యులు, బృందాన్ని శిల్పారామం ఏఓ మోహన్‌తేజ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారాంతంలో ప్రతి ఆదివారం సంగీత, నృత్య, సంస్కృతిక కార్యక్రమాల ద్వారా సందర్శకులను అలరిస్తున్నామన్నారు.

కాచింత ఆలోచించండి


సామర్లకోట సంత మార్కెట్‌లో ఎండిపోయిన చింత చెట్టు

సామర్లకోట: స్థానిక సంత మార్కెట్‌లో చింత చెట్టు పూర్తిగా ఎండిపోయి కూలి పోయేందుకు సిద్ధంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రతి బుధవారం కొట్లమ్మ చెరువు వద్ద ఉన్న మార్కెట్‌లో సంత జరుగుతుంది. ఇక్కడకు పట్టణ ప్రజలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన వారు వస్తుంటారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ ఎండిపోయిన చెట్టును తొలగించాలని స్థానికుడు సానిపిని హరిబాబు కోరారు.

నేడు వేసవి శిక్షణ ముగింపు సభ

పెద్దాపురం: గత నెల రోజులుగా స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ సోమవారం జరుగుతుందని పీసీసీ అధ్యక్షుడు కూనిరెడ్డి అరుణ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ సాయంత్రం ఐదు గంటలకు పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన ఈ సభ ఉంటుందన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా ఆర్డీఓ శ్రీరమణి, డీఎస్పీ శ్రీహరిరాజు హాజరవుతారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

సామర్లకోట: విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సుమారు 40 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ బాస్కెట్‌బాల్ శిక్షణ ముగింపు సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చదువుతో పాటు క్రీడలకు విద్యార్థులు కొంత సమయం కేటాయించాలని పిలుపునిచ్చారు. బాస్కెట్‌బాల్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, కిట్లు అందజేశారు. గుడ్ ఫ్రెండ్స్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 13 ఏళ్లుగా సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ సభ్యులు ఎండీవీ ప్రసాద్, గిడ్ల దేవానంద్, గిరిధర్‌గోపాల్, ఊబా జాన్‌కెనడీ, బి.రాంబాబు, జి.లోవకుమార్, సంజీవరావు, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు


ఆనూరు రామాలయం వద్ద భక్తులతో మాట్లాడుతున్న దొరబాబు

పెద్దాపురం: మండలంలోని ఆనూరు కొత్తూరులో రామాలయ పునర్నిర్మాణ పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు కూనపురెడ్డి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాముడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని దొరబాబు అన్నారు. గ్రామంలో నాయకులు, కార్యకర్తల ఇంటికి వెళ్లి వారి బాగోగులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సింగన త్రిమూర్తులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం


సర్పవరంలో చేయిచేయి కలిపి సందడి చేస్తున్న స్నేహితులు

కాకినాడ రూరల్: ఈ చిత్రంలో కనిపిస్తున్న వారు కుల, మతాలకు అతీతంగా, ప్రాంతీయ భేదాలు లేకుండా వయసు సంబంధం లేకుండా రోజూ తమ కష్ట సుఖాలను పంచుకుంటున్నారు. ఎక్కడెక్కడ నుంచో వచ్చి కాకినాడ, పరిసర గ్రామాల్లో స్థిరపడ్డారు. వీరి కుటుంబ సభ్యులు మరోచోట జీవన గమ్యం సాగిస్తుండగా, ఇక్కడ స్నేహమనే ఆప్యాయత వీరందరినీ ఆనందంగా ఉండేలా చేసింది. కాకినాడ సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ ఉద్యానంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జాతీయ ప్రాణ స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ స్నేహం గొప్పదనం గురించి వివరించారు.

స్నేహం.. అపురూపం

బోట్‌క్లబ్: మన జీవితంలో స్నేహం ఒక అపురూపమైన వరమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కార్యదర్శి అద్దాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రామారావుపేట వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జాతీయ ఉత్తమ స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. కష్టసుఖాల్లో మనతో పాటు నిలబడే వ్యక్తులే స్నేహితులన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రీకాంత్, చైతన్య, కిరణ్, కిషన్, ప్రదీప్, సందీప్ పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలంటూ ఆరోపణలు సరికావు


కృష్ణ పొలంలో ఆరోపణలను ఖండిస్తున్న రైతులు

కొత్తపల్లి: పొలాల మెరక, ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఇసుక తవ్వుతున్నామని, దీనిపై కొంతమంది ఇసుక అక్రమ తవ్వకాలంటూ ఆరోపణలు చేయడం తగదని రైతు వేగిశెట్టి కృష్ణ అన్నారు. మండలంలోని పొన్నాడ శివారు రావివారి పోడులో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై మాజీ ఎమ్మెల్యే వర్మ వెళ్లి పరిశీలించి అక్రమ తవ్వకాలంటూ ఆరోపించడంపై ఆదివారం రైతులు కృష్ణ పొలంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రైతులు పొలాల మెరక పల్లాలు చేసుకుంటుంటే కొంతమంది నాయకులను తీసుకువచ్చి అక్రమ తవ్వకాలంటూ ఆరోపించడం ఎంతవరకూ సబబని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 –19 వరకూ బొండు ఇసుక అక్రమ తవ్వకాలు జరిగితే మీకు కనిపించలేదా అంటూ ప్రశ్నించారు. రైతు మాట్లాడుతూ తవ్వకాలు నిలిచిపోతే తాను ఆర్థిక ఇబ్బందులకు గురవుతానని, తాను ఆత్మహత్యకు పాల్పడితే బొండు ఇసుక అక్రమ తవ్వకాలంటూ ఆరోపించిన వ్యక్తే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో బావిశెట్టి నారాయణస్వామి, వేగిశెట్టి బాబులు, వేగిశెట్టి జామీ, బదిరెడ్డి తమ్మన్న దొర, బావిశెట్టి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో డ్రోన్ సర్వే


ఉప్పాడ తీరంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

కొత్తపల్లి: మండలంలోని మూలపేట, అమీనాబాద్ తీర ప్రాంతాల్లో పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. నిర్మానుష్య ప్రాంతాలు, మద్యం, గంజాయి తాగే వారిని గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలతో ఏరియా సర్వే చేశారు. పలువురికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.